జనవరి - ఫిబ్రవరి, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



"రాబోవు కాలమునందు నీకు మేలు కలుగునను నమ్మిక యున్నది."



# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

మన ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు. దేవుడు మరియొక సంవత్సరము సజీవులుగా ఉంచినందుకు దేవునికి మనము ఎంతో ఋణస్తులమై యున్నాము.


2010 వ సంవత్సరమంతా దేవుడు తన మహా కృపను అనుగ్రహించి నన్నును, పరిచర్యను నడిపించడం జరిగింది. గడిచిన సంవత్సరము నాతో కలసి పరిచర్యలో పాలిభాగస్తులుగా ఉన్న సహోదర, సహోదరీలకు ప్రత్యేకమైన వందనములు. మందిరపు పని, వాక్యమును బోధించుట, సాక్ష్యము ఇచ్చుట, గృహములను దర్శించుట, స్పర్శ ద్విమాస పత్రిక కొరకు పనిచేయుట, క్షమించుట, వారికి కలిగిన డబ్బును దేవుని కొరకు ఖర్చు చేయుట ఈలాగున అనేకులు చూపించిన ప్రేమ, అనురాగములు ఈ పరిచర్యను 2011వ సంవత్సరములోనికి నడిపించడం జరిగింది. 2010 వ సంవత్సరములో రాష్ట్రములో అకాల వర్షముల వలన రైతులు పంటలను ఎంతో నష్టపోవడం జరిగింది. 2011 వ సంవత్సరములో వ్యవసాయం చేసే వారిపైన దేవుని కనికరము ఉండునట్లుగా ప్రార్థించెదము. నూతన సంవత్సరములో మనుష్యులు ఎన్నో నిర్ణయములను తీసుకుంటారు కాని తీసుకున్న నిర్ణయముల ప్రకారం తమ జీవితములను నడిపించుకునేవారు కొంతమంది మాత్రమే. దేవునిని ఎరిగిన మనం ఆ కొద్దిమందిలో ఒకరముగా ఉండాలి.

స్పర్శ పాఠకులైన ప్రతి ఒక్కరు ఈ సంవత్సరములో తీసుకున్న తీర్మానములు నెరవేర్చుడానికి కావలసిన దేవుని సహాయం కొరకు అడుగవలెను. ఖచ్చితంగా ఏదైనా ఒక మార్పు జీవితంలో రావాలని పట్టుదల గలవారై ఉండండి.

నూతన సంవత్సరములో దేవుని పని నమ్మకంగా చేయుటకు, పరిచర్య చేసే ప్రతి ఒక్కరికి దేవుడు జ్ఞానం దయచేయాలని మరియు కావలసిన కృపను దేవుడు అనుగ్రహించునట్లుగా మీరు ప్రార్థించవలసినదిగా మిమ్మును వేడుకొనుచున్నాను.

దేవుడు మిమ్మును, మీ కుటుంబములను 2011 వ సంవత్సరములో దీవించి కాపాడును గాక!

మీ సహోదరుడు.....



జనవరి - ఫిబ్రవరి, 2011

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- భవిష్యత్ ........ 2
- గుడ్ & బ్యాడ్ ........ 4
- అసాధారణమైన ధైర్యం (స్త్రీల ప్రత్యేకం) ........ 5
- నా నిర్ణయములు ........ 8
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 14వ భాగము ........ 9
- వజ్రం (బాలల శీర్షిక) ........ 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 13
- దేవుని ప్రేమ కథ ........ 15
- ఆత్మ ఫలము ........ 18
- లెబానోను పర్వతము ........ 20
- బైబిల్ క్విజ్-14 ........ 21
- ప్రార్థనా కూడికలు ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23



మా చిరునామా: **ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# భవిష్యత్

- బ్రదర్ ఎపఫ్రా



**"రాబోవు కాలమునందు నీకు మేలు కలుగుననను నమ్మిక యున్నది."**

దేవుడు మనకు అనుగ్రహించిన వాగ్ధానముగా విశ్వసిస్తున్నాము. ఇశ్రాయేలు ప్రజలను ఉద్దేశించి యిర్మీయా ప్రవక్త ద్వారా ఆదరణ గొలిపే ఈ మాటను దేవుడు తెలియజేసియున్నాడు. రాబోవు కాలము అనగా, భవిష్యత్తును గూర్చిన సంగతులను తెలియజేయగలిగిన శక్తి, కాలమును, సమయమును తన ఆధీనంలో ఉంచుకొనిన సర్వాధికారి అయిన దేవునికి తప్ప మరి ఎవ్వరికిని లేదు (ప్రసంగి 8:7) మన జీవితంలో రాబోవు కాలమందు ఆయన ఉద్ధేశించిన సంగతులు మేలు కరమైనవి గాను, ఎంతో ఆదరణ కలిగించేవి గాను ఉన్నాయి. ఆయన చెప్పిన మాటను విశ్వసించ గలిగితే మన జీవితములలో అద్భుతమైన సమాధానమును అనుభవించవచ్చు. లోకము ఇటువంటి ఆదరణను ఎరుగదు ఎందుకంటే కీర్తన 146:3 లో చెప్పబడినట్లు రాజుల వలన రక్షణ కలుగదు. వారు చేసిన వాగ్ధానాలు వారితో పాటే మంటి పాలగుతాయి. సజీవుడైన దేవుని వాగ్ధానం మన జీవితములను ప్రతిదినం ప్రోత్సాహపరచి, ఆదరించి, ముందుకు నడిపించగలదు.

ఆ దినములలో ఇశ్రాయేలు ప్రజలు పూర్తిగా నిరీక్షణలేని స్థితిలో ఉన్నారు. తమ పిల్లలు బబులోనులో బానిసలుగా చెరలో ఉన్నప్పుడు, రాబోవు కాలమందు వారికి మేలు కలుగుతుందని వారి పిల్లలు మరలా స్వదేశమునకు వస్తారని దేవుడు వాగ్ధానం చేసాడు.

ప్రియ దేవుని పిల్లలారా ! మీరు ఎటువంటి క్లిష్ట పరిస్థితులలో ఉన్నా రాబోవు దినములు  మీ జీవితానికి దేవుడు అనుగ్రహించే క్షేమమును, మేలును తీసుకువస్తాయి. యిర్మీయా 29:11లో దేవుడు సెలవిచ్చినట్లు, ఆయన మన పట్ల కలిగి ఉన్న ఉద్ధేశ్యములు సమాధాన కరమైనవేగాని హానికరమైనవి ఎంత మాత్రము కాదు. తన స్వంత కుమారుని మన కొరకు అనుగ్రహించుటకు వెనుతీయని దేవుడు, శాశ్వతమైన ప్రేమతో ప్రేమించుచూ విడువక మన యెడల తన కృపను చూపించు చున్నాడు.

అబ్రాహాము జీవితమును చూచినట్లయితే, వాగ్ధానమును నమ్మి దేవుడు చూపించిన దేశమునకు వెళ్ళుట ద్వారా తన జీవితంలో గొప్ప మేలును అనుభవించడమే కాకుండా ఈ లోకములోని విశ్వాసులకు మేలు కలగడానికి దేవుని సాధనముగా ఉపయోగపడ్డాడు.

దేవుడు చేసే ఏ మేలు అయినా అది నీకు ఆశీర్వాదకరముగా ఉండటమే కాక నిన్ను అనేకులకు ఆశీర్వాద కారణముగా మారుస్తుంది.

ఆది 12:1,2 అబ్రాహాము మన వంటి బలహీనతలు కలిగిన వాడే అయినప్పటికి తన 75 సంవత్సరముల వయస్సులో దేవుడు చేసిన వాగ్దానమును నమ్మి తన స్వజనులను, తన దేశమును విడిచి దేవుడు చూపించు దేశమునకు బయలు దేరాడు. “అతడు యెహోవాను నమ్మెను, ఆయన అది అతనికి నీతిగా ఎంచెను” ఆది 15:6. ప్రియ దేవుని బిడ్డా దేవుని మాటను సందేహించకుండా నమ్ముటయే నీతి అని గ్రహించుచున్నావా ?

పరిశుద్ధ గ్రంథ సారాంశమంతా ప్రేమ అయితే ఆ ప్రేమను సందేహించకుండా నమ్మడమే దేవుడు మన నుండి ఆశిస్తుంది. అందుకే పలుమార్లు దేవుడు మన పట్ల తనకున్న మేలుకరమైన ఉద్దేశ్యములను గురించి భక్తుల ద్వారా లేఖనములలో వ్రాయించాడు. మనకి దేవుడనుగ్రహించిన వాగ్దానము కూడా దేవుని యొక్క నమ్మకత్వము మనకు గుర్తు చేసేదిగా ఉన్నది.

ప్రియ దేవుని పిల్లలారా మీ జీవితంలో నుండి అపవాది దేనిని చెరపట్టుకు పోయినా, శరీర ఆరోగ్యం అయినా, మానసిక సంతోషం అయినా, కుటుంబ ఐక్యత అయినా, ఆత్మీయ ఎదుగుదల అయినా, మరి ఏదైనను దేవుడు దానిని తిరిగి నీయొద్దకు వచ్చునట్లుగా నీ జీవితంలో మేలు చేయగలడు. ఆయన నీ నుండి కోరుచున్నది ఈ నూతన సంవత్సరములో ఆయన వాగ్దానమును విశ్వసించి ఆయనకు మొర్రపెట్టడం. మనము ఆయన వైపు తిరగడానికి ఇష్టపడి మన ప్రవర్తనను మార్చుకొనిన యెడల ఆయన మనలను కరుణించి స్వస్థపరిచే దేవుడు. (యెషయా 57:18) నీవు అనేక మందిని నమ్మి మోసపోయి ఉండవచ్చు. కానీ దేవుని వాగ్దానమును నమ్మి ఆయన వైపుకు తిరిగినట్లయితే నీ జీవితంలో అద్భుతమైన సమాధానమును సంతోషమును పొందుకోగలుగుతావు. పరిచర్యలోనూ, నా వ్యక్తిగత జీవితంలోనూ, అనేక కుటుంబములలోను గమనించినప్పుడు దేవుడు చేస్తూ ఉన్న మేలులు ఎంతో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలుగజేస్తూ ఉంటాయి.

ప్రియ దేవుని బిడ్డా, అబ్రాహాము వలె నమ్మి దేవుని వాగ్దానాన్ని నీ స్వంతం చేసుకుంటే నీవు కూడా దేవుడు నీ కొరకు దాచిన మేలులు అనుభవించగలవని నేను ధైర్యముగా చెప్పగలను. అటువంటి కృపను ఈ నూతన సంవత్సరములో దేవుడు మీకనుగ్రహించును గాక !

# గుడ్ & బ్యాడ్

| | | |
|---|---|---|
| 1. చింతించుట | - | గొప్ప నాశనకరమైన అలవాటు |
| 2. ఇచ్చుట | - | అధిక సంతోషము |
| 3. వ్యక్తిత్వము పోగొట్టుకొనుట | - | ఎంతో నష్టము |
| 4. సహాయము చేయుట | - | సంతృప్తిని ఇచ్చేపని |
| 5. స్వార్థము | - | అసహ్యమును పుట్టించు వ్యక్తిత్వము |
| 6. ప్రోత్సాహము | - | గొప్పదైన చిన్న సహాయము |
| 7. భయము | - | జయించగలిగిన పెద్ద సమస్య |
| 8. సమాధానము | - | చక్కటి నిద్రకు మందు |
| 9. ప్రేమ | - | జీవితములపై అధిక ప్రభావమును చూపించే శక్తి |
| 10. నిరీక్షణ లేకపోవుట | - | అన్నిటి కంటే చెడ్డ విషయం |
| 11. విశ్వాసము | - | తరగని ఆస్థి |
| 12. నేను చేయగలను | - | ఆత్మ విశ్వాసముతో కూడిన మాట |
| 13. నాలుక | - | మరణకరమైన ఆయుధం |
| 14. దేవుడు | - | జీవితంలో అతి ప్రాముఖ్యమైన విషయం |

# అసాధారణమైన ధైర్యము

- సిస్టర్ విజయ

**"ధైర్యముగా ఉండుము"** అనే మాటని మనము తరచుగా పరిశుద్ధ గ్రంథంలో గమనిస్తాము. ధైర్యం అనేది మనందరికి అవసరమైనది. మన జీవితంలో పరీక్షలు మరియు శ్రమలు కలిగినప్పుడు దుష్టుడు మనలను భయపెట్టాలని చూస్తాడు కానీ మనం వాటిని జయించడానికి కావలసిన విశ్వాసమును మరియు ధైర్యమును దేవుడు అనుగ్రహిస్తారు. స్త్రీలమైన మనము చిన్న చిన్న విషయములకు భయపడుతూ, కుటుంబములలో అసమాధానమును కలుగజేస్తూ ఉంటాము. కానీ దేవుని లేఖనములు మాత్రము "భయపడవద్దు" అని చెప్పుచున్నాయి. భయము అపవాది ప్రేరేపణ వలన కలిగేది, ధైర్యం దేవుని యొద్ద నుండి వస్తుంది. **"లోకములో మీకు శ్రమ కలుగును, అయినను ధైర్యము తెచ్చుకొనుడి"** అని యోహాను సువార్త 16:33 లో చెప్పబడినట్లుగా పరిస్థితులు ఏవైననూ, భయపడక ధైర్యము తెచ్చుకోవాలి. భయం మన జీవితంలో దేవుని యందు అవిశ్వాసమును కలుగజేస్తుంది. ఒక స్త్రీగా దేవుని కొరకు గొప్ప కార్యములు చేయాలంటే, కుటుంబములలో ఆశీర్వాదమును పొందాలంటే భయం స్థానంలో దేవుని యందు బలమైన విశ్వాసము కలిగి, ధైర్యము తెచ్చుకొని జీవించాలి.

ఒక కొండ ప్రాంతములో నివసిస్తున్న గ్రామస్థులందరూ క్రైస్తవులు. వారు పోలీస్‌స్టేషన్‌కి రావాలని వచ్చి క్రైస్తవ్యమును వదులుకుంటున్నట్లు ప్రమాణం చేయాలని ఒక అధికారి హెచ్చరించాడు. ఒకవేళ వారు అలా చేయకపోతే వారి చేతులు కాళ్ళు కట్టివేసి, రాళ్ళతో కొట్టి ఎత్తైన వంతెన నుండి పారిపోతున్న నదిలోనికి త్రోసివేస్తానని వారిని హెచ్చరించాడు. ఈ విషయం విన్న క్రైస్తవులు మధ్య రాత్రి కూడుకొని "మనం క్రైస్తవులుగా ఇక ఉండలేము, లేకపోతే అతడు మనలను నిశ్చయంగా చంపివేస్తాడు" అని చర్చించుకోవడం మొదలు పెట్టారు.

**"మీ దేహములను చంపువానికి భయపడవద్దు కాని మీ దేహమును మరియు ఆత్మను చంపు వానికే భయపడుమని** యేసు సువార్తలలో చెప్పారు కదా! ఒకవేళ అతడు మనలను చంపిన కేవలం మన దేహములను మాత్రమే మన ఆత్మలు సదాకాలం యేసుతో కూడా జీవిస్తాయి  అని ఒక యౌవనస్థుడు లేచి అందరిని ప్రోత్సహించాడు.

"అవును అది నిజమే" అని అందరూ అన్నారు. అందరూ చేతులెత్తి మేము చావడానికే సిద్ధమని జవాబిచ్చారు. మరునాడు ఆ పోలీస్ అధికారి వచ్చి "మీరు రేపు మరణిస్తారు" అని క్రూరంగా నవ్వుతూ అన్నాడు. అయితే ఆ పోలీస్ అధికారి చేపలు

పట్టుటకు నీళ్ళలో నడుస్తుండగా ఒక చెట్టు అతని కాలు తగిలి కాలు జారి నదిలో మునిగి పోయాడు. ఆ సమయం క్రైస్తవులందరూ కలసి ఏకమనస్సుతో దేవునికి ప్రార్థిస్తున్న సమయం. అప్పుడు ఒకడు పరిగెత్తుకుంటూ వచ్చి "మిమ్ములను రేపు చంపాలని ఉద్దేశించిన ఆ వ్యక్తి నదిలో మునిగిపోయాడు" అని చెప్పాడు.

చూశారా! ఇది అనుకోకుండా జరిగిన సంభవం కానే కాదు. క్రైస్తవులైన ఆ గ్రామస్థులు తమకి కలిగిన శ్రమలో భయమును విడిచి, ధైర్యమును ఎంచుకొనినప్పుడు దేవుని యందలి వారి విశ్వాసం దేవుడు కార్యము చేయునట్లుగా ద్వారములను తెరిచింది. ఏ నదిలోనైతే వారిని ముంచాలని ఆ పోలీస్ అధికారి ప్రయత్నించాడో, అదే నదిలో ఆ శత్రువు మునిగి పోవునట్లుగా దేవుడు కార్యం చేశారు. మనము విశ్వాసముతో ధైర్యముతో దేవుని వాగ్దానమును విశ్వసించి ముందుకు సాగుతున్నప్పుడు మన మీద సాతాను వేసిన పన్నాగాలు అన్నీ వ్యర్థమైపోతాయి.

పరిశుద్ధ గ్రంథంలో ధైర్యంతో సమస్యలను ఎదుర్కొన్న స్త్రీలను మనము ధ్యానించినట్లైతే, ఎస్తేరు అనే స్త్రీ దుష్టుడైన హామాను చేతినుండి దేవుని ప్రజలైన యూదులను ధైర్యంతో కోపాడుకోగలిగింది. ఎస్తేరు అందమైన రూపము కలిగినది, అయిననూ ఆమె తన అందమును ఉపయోగించుకోలేదు కానీ తనకి ఉన్న అచంచలమైన విశ్వాసం మరియు మంచి ప్రవర్తన ద్వారా రాజైన అహాష్వేరోషు యొుక్క దయను సంపాదించుకుంది. దేవుని ప్రజలైన యూదులను నాశనం చేయవలెనని రాజ శాసనం చేయబడి, పరిస్థితులు తీవ్రంగా ఉన్ననూ, ఆహ్వానించబడకుండానే రాజు యొక్క ఆస్థానంలోకి విశ్వాసంతో, సాహసం చేసి వెళ్ళింది. ఆ సమయంలో ఆమె కోసం ప్రత్యేకంగా ప్రార్థిస్తున్న యూదుల ప్రార్థనలను దేవుడు ఆలకించి ఆమె విశ్వాసమును దేవుడు ఘనపరిచాడు. అప్పుడు రాజు ఆమెను సంతోషంతో తన ఆస్థానంలోకి చేర్చుకున్నాడు. చివరికి ఆమె దేవుని సహాయంతో తన ప్రజలు నాశనం కాకుండా కాపాడింది.



అదేవిధంగా ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించడానికి నాయకుడిగా దేవుడిచే ఎన్నిక చేయబడిన మోషే యొక్క తల్లియైన యోకెబెదు యొక్క ధైర్యమును గురించి ఆలోచించినప్పుడు మనము ఎంతగానో భయమును పోగొట్టుకోవచ్చు. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో బానిసలుగా వెట్టి చాకిరి చేస్తూ ఉన్న దినములలో వీరి మగ శిశువులను చంపమని ఐగుప్తు రాజైన ఫరో ఆజ్ఞ ఇచ్చాడు. కాని ఆమె రాజాజ్ఞని కూడా



ధిక్కరించి తన కుమారుని 3 నెలలు ఎవరికి తెలియకుండా దాచి ఉంచింది. ఆ తరువాత దేవుడు తన కుమారుని కాపాడతాడనే విశ్వాసముతో ఆమె వానిని జమ్ము పెట్టెలో పెట్టి నదిలో వదిలింది. చివరికి మోషే ఫరో కుమార్తె వద్దకు జాగ్రత్తగా ఆ జమ్ము పెట్టె ద్వారానే చేరేంతవరకు అక్కడే కనిపెట్టుకొని యున్న మోషే అక్కయైన మిర్యాము భయపడి, పారిపోయి మరియు దాగుకోవడానికి బదులు ధైర్యంగా ఆమె యొద్దకు వెళ్ళింది. ఆ పిల్లవానికి పాలు ఇవ్వడానికి ఒక దాదిని తీసుకు వస్తానని ఆమె ఫరో కుమార్తెతో ధైర్యంగా చెప్పింది. ఆ దాదియే మోషే తల్లి.

ఎంత క్లిష్టమైన పరిస్థితులు ఉన్ననూ ధైర్యంతో వాటిని అధిగమించుట అనేది అవసరం. ఈ ధైర్యం ఆపదలో ఉన్న యూదుల ప్రాణాలను కాపాడగలిగింది. ఇశ్రాయేలు ప్రజలను నడిపించగలిగిన గొప్ప నాయకుడిని అనుగ్రహించింది.సమస్య నుండి పారిపోక, జీవితంలో అసాధారణ ధైర్యంతో జీవించుట నేర్చుకోవడం ప్రారంభిస్తే అసాధారణ కార్యములను ఆయన మన జీవితంలో, కుటుంబములలో జరిగిస్తారు.

కాబట్టి ప్రియ సహోదరీ! కుటుంబంలోని వారి మార్పు, ఆర్థిక, ఆత్మీయ, ఆరోగ్య పరంగా సమస్య, శోధన ఎదురవుచున్నప్పుడు భయంతో క్రుంగిపోయి, నిరాశపడిపోక, ప్రతి పరిస్థితిలో మార్పుని కలుగజేయగలిగిన దేవుని యందు విశ్వాసముంచి “నేను వాటిని జయించగలను” అని ధైర్యము తెచ్చుకొనుట ద్వారా దేవుని కొరకు గొప్ప కార్యములు చేసే స్త్రీలుగా మనలను సిద్ధపరుస్తారు.

***అట్టి ధైర్యమును ఈ నూతన సంవత్సరములో దేవుడు మనకి అనుగ్రహించును గాక !***

# నా నిర్ణయములు

ఓ దేవా !

నిద్రలో ఉన్న నా ఆత్మని తట్టి లేపి, భవిష్యత్‌లో విజయం కొరకు సిద్ధపరుస్తున్నందుకు వందనములు. జీవితములో కలుగుచున్న శోధనలన్నిటి నుండి తప్పించబడి, సవాళ్ళన్నింటిని ధైర్యంగా ఎదుర్కొని, నన్ను నేను సాధకం చేసుకొనునట్లుగా మంచి నిర్ణయములు చేసుకొని, అనుసరించడానికి కృప చూపించు తండ్రీ !

1. ఈ దినము నుండి నా సమయమును సోమరి తనముతో జీవించక, నేను అభివృద్ధి పొందడానికి వచ్చిన ప్రతి అవకాశమును ఉపయోగించుకుంటాను.
2. ఈ దినము నుండి నా వ్యతిరేకమైన ఆలోచనా విధానమును మార్చుకొని, అనుకూలంగా ఆలోచించడం నేర్చుకుంటాను.
3. ఈ దినము నుండి నా నాలుకను స్వాధీనములో ఉంచుకొంటాను.
4. ఈ దినము నుండి నేను కనిన కలలు నెరవేర్చబడాలంటే, నా గమ్యమునకు చేరాలంటే నేను నిరీక్షణ కలిగి ఉంటాను.
5. ఈ దినము నుండి నా భావోద్రేకములను అదుపులో ఉంచుకుంటాను.
6. ఈ దినము నుండి నా వైఫల్యాలను విజయమునకు మెట్లుగా భావిస్తాను.
7. ఈ దినము నుండి నా తోటివారియెడల కపటము లేని ప్రేమను చూపించడానికి మాత్రమే ప్రయత్నిస్తాను.
8. ఈ దినము నుండి ఆత్మనూన్యతా భావముతో నిండి ఉన్న వారి హృదయములను స్నేహ భావము ద్వారా గెలవడానికి ప్రయత్నిస్తాను.
9. ఈ దినము నుండి నేను చేయలేను, నా వలన కాదు, ఇది అసాధ్యము అను నిరీక్షణ లేని మాటలు రాకుండా నా నోటిని కాచుకుంటూ, నీ వలన సమస్తమూ సాధ్యమే అని జీవిస్తాను.
10. ఈ దినము నుండి కష్టించి పనిచేయడం, ప్రార్థించడం, విశ్వాసము, నమ్మకము అనునవి విజయమునకు రహస్యములు అని గ్రహిస్తాను.
11. ఈ దినము నుండి నన్ను ఎంతగానో ప్రేమించుచున్న నా దేవుని సహాయంతో మాత్రమే ప్రతి నిర్ణయం తీసుకుంటాను.
12. ఈ దినము నుండి వీటన్నిటిని చేయడానికి మంచి ఆరోగ్యం నాకు అవసరం కనుక ఆరోగ్యం మీద శ్రద్ధ కలిగి జీవిస్తాను.



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 14వ భాగము**

ఎవ్వరు చెప్పినా సువార్త వినడానికి అంగీకరించని వారు కాషాయ వస్త్రములు ధరించి సాధువులా వెళ్ళి తాను చెప్తే వింటారని సుందర్ నమ్మకం. క్రైస్తవ సంఘాల్లో ప్రసంగాలు చేయడానికి తాను అర్హుడు కాకపోయినప్పటికిని కాషాయ వస్త్రములతో సర్వసంగపరిత్యాగిగా గ్రామస్తులకును, సామాన్య జనులకును, పరదాల మాటున ప్రత్యేకంగా ఉండే ఉన్నతకుల స్త్రీలకు కూడా తాను సువార్తను అందించవచ్చుననుకున్నాడు సుందర్. 16 ఏండ్ల వయస్సులోనే లోకంలో ఉన్నదేదియు తనకు ప్రియమైనదిగా మారకముందే సుందర్ ఈ తీర్మానమును చేశాడు, దాని మీదే గట్టిగా నిలబడ్డాడు. సుందర్ మరల సబాతుకు వచ్చిన తరువాతనే ఈ ఆలోచన కార్యరూపం దాల్చింది. బాప్తీస్మం తరువాత సబాతుకు తిరిగి వచ్చిన సుందర్ అచ్చట ఒక నెల రోజులు ఉన్న తరువాత తనకి ఉన్న వస్తువులను క్రమక్రమంగా అమ్మివేస్తూ ముందు ఉన్న కార్యం కొరకు సిద్ధపడుచుండెను. ఆ అరణ్యంలో ప్రార్థిస్తూ గంటల కొలది ధ్యానంలో గడిపేవాడు. కొన్నిసార్లు దూరప్రాంతాలను వీక్షించాడు. ఎటు చూచినా క్రీస్తుని ఎరుగని ప్రాంతములు ఎన్నో కనబడినాయి. దక్షిణంగా వందలాది మైళ్ళ ప్రాంతం వేసవి తాపంతో మండుచూ ఉంది. పశ్చిమమున కూడా కనుచూపు మేర ఆఫ్ఘనిస్తాన్ చూస్తే పరిస్థితి వ్యత్యాసంగా ఉంది. సుదూర ప్రాంతంలో ఎత్తుగా ఉన్న పీఠభూమి కనబడింది. అస్తమించే సూర్యుని కిరణాలు పడినప్పుడు అచ్చట మంచుతో నిండిన హిమాలయ పర్వతాలు కనిపిస్తాయి. వాటికి ఆవల విసిరేసినట్లుగా ఉన్నదే టిబెట్. ఏదో ఒక దినమున తప్పకుండా అక్కడికి వెళ్ళాలి. అయితే మొదట తన స్వంత ప్రజల దగ్గరకు వెళ్ళి వారికి సువార్తను అందించాలి. కాబట్టి 1905 అక్టోబరు తన పాదరక్షలు లేకుండా, సాదాసీదా కాషాయ వస్త్రములు ధరించిన వాడై, ఓ దుప్పటి భుజమున వేసికొని క్రొత్త నిబంధన చేతబట్టిన వాడై సబాతులోని తన స్నేహితులకు వీడ్కోలు చెప్పి భారతదేశ గ్రామాల్లో సువార్తను అందించడానికి బయలుదేరాడు సుందర్. బయలుదేరినప్పుడు తాను ఎక్కడికి వెళదామనేది తెలియకుండానే బయలుదేరాడు. అయితే ముందుగా తన స్వగ్రామమైన రాంపూర్ వెళ్ళాడు. అవకాశం దొరికిన ప్రతిచోట వాక్యన్ని ప్రకటిస్తూ నెమ్మదిగా ఒక గ్రామం తరువాత మరియొక గ్రామమునకు వెళ్ళాడు. మంచి దేహదారుఢ్యము గలవాడై పరిశుభ్రమైన బట్టలు ధరించిన ఈ యౌవన సాధువును



# వజ్రం



Happy New Year పిల్లలూ! Christmas బాగా Celebrate చేసుకున్నారా? ఈ New Year లో ఏం Plans వేసుకున్నారు? మీ Plans దేవుడు ఆశీర్వదించి సహాయం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీ Plans లో ఇది ఉందా? “దేవునికి విధేయత చూపడం” పిల్లలూ ! దేవునికి విధేయత ఎలా చూపుతాము? మీ తల్లిదండ్రులను, teachers ని గౌరవించడం వలన విధేయులుగా ఉంటారు. వారు చెప్పే మాటకు లోబడి జీవించటమే విధేయత.

అనగనగా ఒక రాజుగారు తన రాజ్యంలోని మంత్రి కంటే, సైన్యాధిపతుల కంటే ఎక్కువగా బానిసగా జీవిస్తున్న వ్యక్తిని ప్రేమించేవాడు. ఆ విషయం రాజ్యాధిపతులకి నచ్చక రాజు దగ్గర ప్రస్తావించెను. రాజు బానిసను ఎందుకు ప్రేమిస్తున్నాడో తెలియజేయటానికి ఒక పరీక్షను ఏర్పాటు చేసెను.

అది ఏమిటంటే ఒక విలువైన వజ్రమును ఒక్క దెబ్బతో ముక్కలుగా చేయమని ఆజ్ఞ ఇచ్చెను.మొదట మంత్రి రాజు ఎదుటికి వచ్చి ఆ వజ్రం చాలా విలువైనది ముక్కలు చేస్తే ఎందుకూ పనికిరాదు అని తలంచి ముక్కలు చేయకుండెను. ఆ విధంగానే సైన్యాధిపతులు, అధికారులు కూడా ఆ వజ్రంను ముక్కలు చేస్తే విలువ ఉండదు అని తలంచి చేయలేకపోయారు. రాజు బానిసను పిలిపించి వజ్రమును ముక్కలు చేయమనగానే, ఆ వ్యక్తి దానిని చాలా సులువుగా ముక్కలు చేసెను. వెంటనే ఆ సభలోని వారందరూ విలువైన వజ్రం ముక్కలు కావడం సహించలేకపోయారు. రాజుగారు బానిసను ఈ విధంగా ప్రశ్నించెను. “నీవు విలువైన వజ్రం పాడైపోతుందని ఆలోచించలేదా?” . నా రాజ్య పాలకులు అది ఎంతో విలువైనదని దానిని ముక్కలు చేయలేదు నీవు ఎందుకు దానిని ముక్కలు చేశావు! అని అడిగిన వెంటనే ఆ బానిస, రాజా! “వారు చేసిన పని సహజమే నాకూ అర్థమైంది. నాకు మాత్రం “వజ్రం కంటే మీ మాట ఎంతో విలువైనది” అందుకే ముక్కలు చేశాను అని జవాబిచ్చెను. వెంటనే సభలోని వారందరూ ఆశ్చర్యపడి రాజు ఎందుకు అతనిని ఎక్కువగా ప్రేమించెవాడో గ్రహించిరి. రాజు చాలా సంతోషంగా అతనిని సన్మానించెను.

చూశారా పిల్లలూ! ఒక బానిస, రాజు మాటకు విలువనిచ్చి అతని ప్రేమను పొందుకొనెను. పదవులను బట్టి చూస్తే అతని కంటే గొప్పవారు చాలామంది ఉన్నారు కానీ ఆ వ్యక్తి చూపిన విధేయత అతనికి గొప్పతనాన్ని తెచ్చింది

సహజంగా మనం మనకున్న జ్ఞానాన్ని బట్టి దీనిని అలా చేయాలి, ఇలా చేయాలి అని ప్లాన్స్ వేస్తాము. మనకు నచ్చినట్లే, మనకు తోచిన విధంగా కొనసాగుతాము. మనకి చెప్పిన పనిని బేరీజు వేసుకుంటాము.

యేసుక్రీస్తు దేవుని మాటకు విధేయత చూపి తన ప్రాణాన్ని ఇచ్చెను. మన తల్లిదండ్రులుగాని, పెద్దలుగాని మనల్ని ప్రాణం ఇవ్వమని అడగరు కానీ చిన్న పనులు చెప్తేనే వ్యసనపడిపోతున్నాము. చదువుకోమని చెప్తేనే కోపం, అది మన మంచికే అని గ్రహించము.

చాలా సార్లు మనకు లాభసాటిగా ఉన్నమాటలు చేస్తాము. నష్టము కలిగించేవి వినము. రాజుగారి బానిస, అతనిని సంరక్షించే రాజు మాటని ఏ విధంగా విని విధేయతను చూపాడో ఆ విధంగానే మీరు కూడా మీ పెద్దలకు విధేయులై ఈ నూతన సంవత్సరంలో జీవిస్తారని ఆశిస్తూ ....

God bless you .. పిల్లలూ !

– ఇట్లు ప్రేమతో మీ అక్కయ్య


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

## 2010 జనవరి 26వ తేది ఉపవాస ప్రార్థన

దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,
కుటుంబముల ఆశీర్వాదము కొరకు దేవునిని వేడుకుందాం.

**సమయం:** ఉదయం గం. 9.00 లకు
వివరములకు: బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628

# "నా జీవితములో దేవుని మేలులు"

**జి.సుధాకర్, ఉలిచి**

ప్రియమైన స్పర్శ పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమున వందనములు. మాది ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలము, ఉలిచి అనే గ్రామము. నాకు ఒక చెల్లి, తమ్ముడు, మా తమ్ముడు పుట్టిన తరువాత, 2వ సం॥లోనే మా తల్లి చనిపోయింది. మేము మా నానమ్మ దగ్గర పెరుగుతూ ఉండగా, ఆమె యేసుప్రభువు గురించి చెప్తూవుండేది.

మా నానమ్మ చనిపోయిన తరువాత మా నాన్న ఒక రైతు ఇంట్లో పనికి పెట్టాడు. మేము అక్కడ భోజనము చేసి పని చేస్తూ ఉండాలి. ఆ చిన్న వయసులో వారు పెట్టే బాధలు తట్టుకోలేక, కనపడిన విగ్రహాలకు మ్రొక్కుతూ పూజలు చేస్తూ, యేసుప్రభువుని కూడా ప్రార్థించేవాడిని.

తరువాత నేను హైదరాబాద్ వచ్చి తాపీపనిలో చేరాను. అక్కడ వారం, వారం వచ్చే డబ్బులు తీసుకొని నా ఇష్టానుసారంగా త్రాగుతూ, సినిమాలు చూస్తూ, అల్లరి చిల్లరగా తిరుగుతూ సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే మా ఊరు వెళ్ళేవాడిని. అక్కడ ఒంటరిగా ఉన్న మానాన్న సంవత్సరమంతా పనిచేసావు కదా, డబ్బులు ఏవి అని అడిగితే, లేవు అయిపోయాయి అని చెప్పి మరల హైదరాబాద్ వచ్చేవాడిని.

ప్రతిరోజు పగలు పనికి వెళ్ళడము, రాత్రి బాగా త్రాగి, ఒళ్ళు తెలియకుండా, దోమలు కుడుతున్నా ఒళ్ళు తెలియకుండా పడి నిద్రపోయేవాడ్ని. ఒకసారి నాకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది, నా అనేవారు ఎవరూ లేక అలాగే రూమ్‌లోనే పడి ఉన్నాను. ఈ నా త్రాగుడు వ్యసనము ఫ్రెండ్ అయిన ఒక అతను ఎపఫ్రా మినిస్ట్రీస్‌కు పరిచయం. అక్కడ బోధించే దేవుని యొక్క మాటలు విని తన మనసు, అలవాటులు మార్చుకొని ఎంతో ప్రశాంతమైన జీవితం జీవించుచున్నాడు. ఒకసారి 2005, జూన్ నెల నన్ను కలిసి, మా మినిస్ట్రీ బ్రాంచ్ అయిన చింతల్‌లో ఒక మందిరము ఓపెనింగ్ ఉంది, వెళ్దాము రమ్మని అడిగాడు. అక్కడకు వెళితే బస్ ఛార్జెస్ ఖర్చు అవుతాయి, మరల 2 గం॥లు కూర్చుని వాళ్ళు చెప్పేది వినాలి దాని కంటె ఆ డబ్బులతో హాయిగా త్రాగేసి నా రూమ్‌లో పడుకోవచ్చు అనుకున్నాను. అయితే అతను నన్ను విడిచిపెట్టకుండా, నా డబ్బులతో తీసుకొని వెళ్తాను అని తీసుకొని వెళ్ళాడు. అక్కడ దైవసేవకులైన ఎపఫ్రాగారు ఎంతో వేదనతో తన సాక్ష్యం చెప్పినపుడు మనిషి అంతా బాగానే ఉన్నాడు కదా, ఎందుకు అలా ఏడుస్తున్నాడో అర్థం కావడం లేదు అని, నాలో నేను సణుగుకున్నాను. ప్రార్థన అయి పోయిన తరువాత తిరిగి వెళ్ళిపోదాము అనుకుంటే, పెద్దవర్షం పడుతుంది, మరియు నన్ను తీసుకొని వచ్చిన అతను కనిపించకుండా వెళ్ళిపోయాడు. చాలామంది అక్కడే మందిరములో పడుకొనుచుండగా ఈ ప్రార్థన వాళ్ళు ఏదో చెపుతారు,

ఎందుకు ఏడుస్తారో తెలియదు అనుకొని నేను కూడా వారితో ఆ బలిపీఠము దగ్గర పడుకున్నాను. ఆ రాత్రి నాకు కలలో దైవసేవకులైన ఎపఫ్రాగారి రూపంలో ఒక వ్యక్తి కనబడి, నన్ను వెంబడించు అని చెప్పుచుండగా, నేను ఎక్కడికి రావాలి ? అని అడుగుతున్నాను. నా వెనకే రా అని చెప్పారు. ఒక మలుపు తిరిగి ఇంకొక మలుపులోకి నేను వచ్చేటప్పటికే నువ్వు వెళ్ళిపోతున్నావుగా అని అడిగినపుడు నా వెనకే రా అని చెప్పి, వెళ్ళిపోయారు. వెంటనే నాకు మెలకువ రాగా నా శరీరమంతా చెమటలు పట్టి, తేలికగా అనిపించింది. ఆ ప్రార్థన నుండి తిరిగి వచ్చిన తరువాత నా వ్యసనములన్నింటిని విడిచిపెట్టి, భాగ్యలత కాలనీలోని ఎపఫ్రా మినిస్ట్రీస్ మందిరమునకు వెళ్ళి, అక్కడ దేవుని వాక్యములు వింటూ ఏ విధంగా దేవుని వెంబడించాలో నేర్చుకున్నాను. ఈ స్థితిలో లోకానుసారమైన స్నేహితులు అనేకమంది నాకు దూరమయ్యారు. అప్పుడు ఎపఫ్రా అన్న స్నేహితులు ఎంతమంది ఈ లోకంలో నిన్ను ఒంటరిని చేసిననూ దేవుడు స్నేహితుడిగా ఉంటారు అని చెప్పిన వాక్యం ద్వారా ఆదరించబడి, బలపరచబడ్డాను. పరిచర్యలోని సహోదరుల ప్రేమ నన్ను ఎంతగానో ఆదరించింది. నేను ఏమీ చదువుకోలేదు కాని దైవసేవకులు చెప్పిన వాక్యములను మాత్రమే ధ్యానించుకుంటూ 2005 వ సంవత్సరం సెప్టెంబర్ నెలలో బాప్తీస్మం తీసుకోవడం జరిగింది. అంత మాత్రమే కాక, ఋణ సమస్యలన్నీ తీర్చడానికి, మా ఊరిలో ఒక ఇల్లు కట్టుకోవడానికి కూడా దేవుడు కృప చూపించారు.

నా వివాహ విషయంలో కూడా మా బంధువులందరూ త్రాగుబోతులైన వీరికి పిల్లని ఎవరిస్తారు? అని వదిలివేయడం జరిగింది. దేవుని మహాకృప ద్వారా దేవుని ఎరిగిన అమ్మాయిని వివాహం చేసుకున్నాను. ఒకరోజు విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతూ హాస్పిటల్‌కి వెళ్ళాను. డాక్టర్స్ వెంటనే ఆపరేషన్ చెయ్యాలి అని అన్నారు. ఆ సమయంలో పరిచర్యలోని సహోదరులు వచ్చి, డాక్టర్స్‌తో మాట్లాడిన తరువాత ఆపరేషన్ ఏమీ అవసరం లేదు అని చెప్పి ఇంటికి తీసుకువచ్చారు. తరువాత దైవసేవకులు ప్రార్థించగా ఆ కడుపునొప్పి ఇంతవరకు మరల రాలేదు. అద్భుతమైన స్వస్థతని దేవుడు అనుగ్రహించారు. అదే విధంగా మాకు సంతానం కలగడం కూడా కష్టం అని డాక్టర్లు చెప్పినప్పటికీ, దేవుని మహా కృప ద్వారా ఒక కుమారుడిని నాకు అనుగ్రహించారు. నా చేతి పనిని కూడా దేవుడు ఆశీర్వదించారు.

తల్లిదండ్రులు, బంధువులు ఎవ్వరూ చూపించని ప్రేమ, దైవసేవకులు, సంఘము చూపించుట ద్వారా దేవుని ప్రేమను ఎరిగి అనుభవించుచూ ఉన్న నా జీవితము చివరి శ్వాస వరకు ఆయనలో జీవించాలని, వ్యసనముల నుండి నేను పొందిన విడుదల ఏ విధంగానైనా కొంతమందికి ప్రయోజనకరంగా ఉండాలనే నా ఆశని దేవుడు తీర్చునట్లుగా నా కొరకు ప్రార్థించగలరు.

# దేవుని ప్రేమ కథ

ఒక దినమున సంతోష్ అనే వ్యక్తి ఉదయమునే లేచి సూర్యోదయములోని అందమును ఆస్వాధిస్తూ, దేవుని సృష్టిలోని అందమైన పని తీరుని ప్రశంసిస్తూ, ఆయన యొక్క జ్ఞానమును కొనియాడుచూ, దేవునిని స్తుతించుచూ ఉన్నప్పుడు దేవుని యొక్క సన్నిధి అతనిని ఆవరించి, దేవుని ఆత్మతో నింపబడ్డాడు.

ఆ సమయంలో దేవునికి, సంతోష్‌కి జరిగిన సంభాషణ –

దేవుడు :– నీవు నన్ను ప్రేమిస్తున్నావా ?

సంతోష్ :– అవును దేవా ! నువ్వు నా దేవుడవు మరియు రక్షకుడివి

దేవుడు :– నీవు అంగహీనుడివైననూ నన్ను ప్రేమిస్తావా?

(సంతోష్ విస్మయంతో తన శరీరంలోని కాళ్ళు, చేతులు అన్నింటిని చూచుకొని, ఇవన్నీ నాకు దేవుని వలన అనుగ్రహించబడ్డాయని ఎలా మర్చిపోగలిగాను అని అనుకొని)

సంతోష్ :– అయిననూ ప్రభువా, నేను నిన్ను ప్రేమిస్తాను.

దేవుడు :– నీవు గ్రుడ్డివాడివైననూ నేను సృజించిన సృష్టిని ప్రేమిస్తావా?

(కన్నులు లేకుండా సృష్టిని ఏ విధంగా చూడగలను? ప్రపంచంలోని ఎంతో మంది గ్రుడ్డివారు ఉన్నారు, వారిలో ఎంతమంది ఈ సృష్టిని సృజించిన దేవునిని ప్రేమిస్తున్నారు?)

సంతోష్ :– "ఇది ఆలోచించడానికే కష్టం ప్రభువా, అయిననూ మిమ్ములను ప్రేమిస్తాను ప్రభువా !"

దేవుడు :– నీవు చెవిటివాడివైననూ, నా మాట వింటావా?

సంతోష్ :– చెవిటివాడనైతే నీ మాట ఎలా వినగలను? బైబిల్‌లోని దేవుని మాటలు చెవుల ద్వారా మాత్రమే కాదు, హృదయం ద్వారా వినగలను. ఇది చాలా కష్టం. అయిననూ నీ మాట వింటాను ప్రభువా !

దేవుడు :– నీవు మూగవాడివైననూ నన్ను స్తుతించగలవా?

(నోరు లేకుండా ఏ విధంగా నేను స్తుతించగలను? నాకు వెంటనే జ్ఞాపకం వచ్చిన విషయం దేవుడు మన హృదయంతో, మరియు ఆత్మతో పాడే పాటను కోరుకుంటున్నాడు అని, కృతజ్ఞతతో కూడిన హృదయములోనుండి వచ్చే ప్రతి మాట ఆయనకు అంగీకారమే.

సంతోష్ :- నీ నామమును స్తుతిస్తాను ప్రభువా!

దేవుడు :- నీవు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?

సంతోష్ :- ఎంతో గట్టిగా, యదార్థంగా అవును దేవా! నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను ఎందుకంటే నువ్వు నిజమైన దేవుడవు.

(సమాధానము చాలా బాగా చెప్పాను అని నేను అనుకున్నాను కానీ ఆయన అడిగారు)

దేవుడు :- అయితే ఎందుకు పాపం చేస్తున్నావు?

సంతోష్ :- ఎందుకంటే నేను అల్పుడను, మంటివంటి వాడను.

దేవుడు :- అయితే సంతోష సమయంలో మాత్రం నాకు దూరంగా, శ్రమ కలిగిన సమయములో మాత్రమే నా సన్నిధిలో ప్రార్థించే వాడిగా ఎందుకు ఉన్నావు?

(సంతోష్‌కి సమాధానం లేదు, కన్నీరు మాత్రమే మిగిలింది. దేవుడు ఇంకా కొనసాగిస్తూ)

దేవుడు :- అనేక ప్రార్థనా కూడికలలో, రిట్రీట్స్‌లో నా నామమును స్తుతిస్తారు, నన్ను ఆరాధిస్తారు కానీ స్వార్థంతో ఎందుకు జీవిస్తారు.

(కన్నీరు సంతోష్ చెంపల మీదుగా కారసాగింది)

దేవుడు :- నా నామమును ఎందుకు అవమానపరుస్తున్నావు? ఎన్నో మంచి విషయములు ఉండగా చెడ్డ విషయములను ప్రచారం చేస్తూ ఎందుకు కాలక్షేపం చేస్తున్నావు?

సంతోష్ సమాధానమివ్వడానికి ప్రయత్నించాడు కానీ అతని దగ్గర సమాధానమేమి లేదు.

దేవుడు :- నీ జీవితము ఆశీర్వదించబడింది, ఆ ఆశీర్వాదము నుండి నేను నిన్ను త్రోసివేయలేదు, నన్ను వెంబడించటానికి అనేక అవకాశములను నీకు అనుగ్రహించాను అయిననూ నీవు నా నుండి వెనుదిరుగుతూనే ఉన్నావు, నా మాటని వినిపిస్తూనే ఉన్నాను. అయిననూ స్వభావమును మార్చుకోవట్లేదు నేను నీతో మాట్లాడుతూనే ఉన్నాను, నీ చెవులు మూసుకుపోయాయి, నా ఆశీర్వాదమంతటిని నీకు చూపిస్తూనే ఉన్నాను నీ కళ్ళు మాత్రము నా నుండి దూరమవుతూనే ఉన్నాయి. నా సేవకులను అనేక సార్లు నీ యొద్దకు పంపుతున్నాను, నీవు మాత్రం నిర్లక్ష్యంతో వారు చెప్పిన మాటలు వినకుండా

వారిని త్రోసివేస్తున్నావు. నేను మాత్రం నీ ప్రార్థనలు అన్నీ విని వాటికి సమాధానమివ్వాలని కోరుకుంటున్నావు. "నువ్వు నిజముగా నన్ను ప్రేమిస్తున్నావా ?"

సంతోష్ సమాధానమేమీ ఇవ్వలేకపోయాడు. అతను ఎంతో ఏడుస్తూ ప్రభువా నన్ను క్షమించండి నేను మీ బిడ్డగా ఉండటానికి అర్హుడను కాను అన్నాడు. వెంటనే

దేవుడు :- "అదే నా కృప కుమారుడా ! " నా కృప నిన్ను అర్హుడిగా చేస్తుంది.

సంతోష్ :- మరి ఎందుకు దేవా నన్ను ఇంకా క్షమిస్తూనే ఉన్నారు? ఎందుకు నన్ను ఇంతగా ప్రేమిస్తున్నారు ?

అందుకు

దేవుడు :- ఎందుకంటే నా పోలికలో, నా చేతులతో నిర్మించిన నా కుమారుడివి నీవు. నీవు కన్నీరు కారిస్తే నేను కూడా నీతో కన్నీరు కారుస్తా, నీవు ఆనందంతో గంతులు వేస్తే, నేను నీతో సంతోషిస్తాను, నీ బలహీన సమయములో ఆదరిస్తాను నువ్వు పడిపోతే పైకి లేపుతాను, నువ్వు అలసిపోయినప్పుడు నా చేతులమీద పట్టుకుంటాను. నీ చివరి దినం వరకు నేను నీతోనే ఉంటాను, నిన్ను ఎప్పటికి ప్రేమిస్తూనే ఉంటాను.

సంతోష్ :- (తనలో తాను) నేను ఎంతగా దేవుని ఇబ్బంది పెట్టాను అని గ్రహించి, ఇంతకు ముందు ఎన్నడూ ఏడవనంతగా ఏడ్చి,

ప్రభువా, ఎంతగా నన్ను ప్రేమిస్తున్నారు?

ఆయన మేకులతో కొట్టబడిన తన చేతులను చాచి, చూపిస్తూ ఇంతగా అని అన్నప్పుడు నా తలను తీసుకు వెళ్ళి, ఆయన పాదముల యొద్ద ఉంచి, నా రక్షకుడవు నీవే, అని మొట్టమొదటి సారి, ఆయన సన్నిధిలో నిజమైన ప్రార్థనను చేశాను.



**ఎపఫ్రా మినిస్ట్రీస్ - 2011**

నూతన సంవత్సర కాలెండర్స్ కొరకు సంప్రదించండి.

బ్రదర్. **పి.రవీందర్,**

ఎపఫ్రా మినిస్ట్రీస్, హైదరాబాద్. సెల్: 99631 17628

# ఆత్మ ఫలము - 12వ భాగము




**అయితే ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము.**


**ఆత్మఫలములో తొమ్మిదవది ఆశానిగ్రహము**

**"పట్టణమును పట్టుకొనువానికంటే తన మనసును స్వాధీనపరచుకొనువాడు శ్రేష్ఠుడు".** ఆత్మఫలములో ప్రాముఖ్యమైనది, చిట్ట చివరిది ఆశానిగ్రహము. దీనినే నియంత్రించుకొనుట లేదా క్రమశిక్షణ అనవచ్చు. క్రైస్తవ్యంలో ఆశానిగ్రహము ఎంతో విలువైనది . ఇది లేని క్రైస్తవుడు క్రైస్తవుడు కాదు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అందుకే బైబిల్‌లో "ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక .... భక్తి పరుడను అనుకుంటే వాని భక్తి వ్యర్థమే". ఎందుకు ఇతని భక్తి వ్యర్థము? కళ్లెము అంటే నిగ్రహము. ఇది కేవలం నోటికే కాదు, ఆలోచనలు, కోరికలు, ఉద్రేకాలు, ధనాశ, వ్యామోహము, దుర్వ్యసనములు ఇలా చాలా విషయాలలో నియంత్రణ అవసరం. **"తిను – త్రాగు – సుఖించు"** ఇదే ఇప్పటి లోకపు తీరు. అనగా నచ్చింది చెయ్యి అనగా నియంత్రణ తేకుండా బ్రతకటం. కానీ దేవుడు మనిషిని సృజించినపుడు "మీరు ఏలండి" అని ఆజ్ఞాపించాడు. కానీ మనిషి ఏలుబడిలోకి జారిపోయాడు. మరణ భయము రావడానికి కారణం దేవుడు తినవద్దు అన్న పండును త్ని ఆదాము, అవ్వే. ఆ పండు చూపులకు బావుంది అని, ఆహారానికి మంచిదని అన్పించి, వివేకమునిస్తుందని, అవ్వ, ఆదాము ఆశని నిగ్రహించుకోలేక సాతాను మాట విని తిన్నారు. అంటే ఆ ఆలోచనను నియంత్రించలేక పాపమని తెలిసినా చేశారు. ఫలితం మరణము, ఇప్పటికీ ఇదే జరుగుతోంది. కారణము శరీరము, ఆత్మ మధ్య పోరాటం జరుగుతుంది. చివరికి ఒక నిర్ణయంతో ప్రతిపోరాటం ముగుస్తున్నది. అందుకే భక్తుడైన పౌలు **"మేలైనది చేయవలెనను కోరిక నాకు కలుగుచున్నది గాని, దానిని చేయుట నాకు కలుగటలేదు. నేను చేయగోరు మేలు చేయక, చేయగోరని కీడు చేయుచున్నాను".** అని ఎంతో దు:ఖపడ్డాడు. (రోమా 7:8)

మనలో కూడా ప్రాచీన స్వభావమునకు, నవీన స్వభావమునకు మధ్య పోరాటం ఉంటుంది. పాపమును జయించడం ఆశానిగ్రహం వల్లే సాధ్యం. కానీ కృప లేకుండా మనం ఏమీ చేయలేము. మనము కృపతో ఆశానిగ్రహాన్ని కలిగి క్రీస్తువలె జీవించడానికి పిలువబడ్డాము. ఎలా ఆశానిగ్రహాన్ని కలిగి జీవించాలి? ఉదాహరణగా కడపటి ఆదాముగా

వచ్చిన యేసయ్య శరీర ధారియైయున్న కాలములో నలుబది దినములు ఉపవసించి ప్రార్థించిన తరువాత అపవాది మూడు విషయములలో శోధించాడు. నేత్రాశ, శరీరాశ, జీవపుడంబము అను మూడింటిని వాక్యము ద్వారానే జయించాడు. ఇదే విధముగా మనము కూడా కోరిక కలిగిన వెంటనే వాక్యమును జ్ఞాపకం చేసుకోవటం ద్వారా నిగ్రహమును పొందగలము. "ప్రతి ఆలోచననూ క్రీస్తుకి లోబడునట్లుగా చెరపడుతూ ఉండటం ద్వారా మనము ఆశానిగ్రహాన్ని కలిగి ఉండగలం.

నీ ఆలోచనల్లో తప్పున్న వెంటనే ఆయన నీకు కళ్లెం వేస్తాడు, గుర్తు తెస్తాడు, నీ మాటల్లో తప్పున్నప్పుడు నీ నోటికి కళ్లెం వేస్తాడు. అపో. పౌలు అన్నీ చేయుటకు నాకు స్వాతంత్ర్యము ఉన్నది కాని అన్నీ చేయదగినవు కావు అంటాడు. మన కన్నులు, నాలుక, ఆలోచనలను మనము స్వాధీనపరచుకోవాలి. ఫలానాది లేకపోతే నేను సంతోషంగా ఉండలేను అనే మాట ఏ పరిస్థితిలోనూ మన జీవితంలో ఉండకూడదు. ఆత్మనిగ్రహం లేని క్రైస్తవుడు అంటే సాతానుకు అపరిమితమైన సంతోషం. కాబట్టి మన భక్తిని మనమే సాధకం చేసుకోవాలి. దేవుడు మనకి నిగ్రహం గల ఆత్మ ఇచ్చియున్నాడు గాని పిరికితనము గల ఆత్మ ఇవ్వలేదు. కనుక ఆశానిగ్రహం అన్ని విషయములలో ఎంతో అవసరం.




# లెబానోను పర్వతము



పలెస్తీనుకు ఉత్తరముగా ఉన్న రెండు పర్వత పంక్తులు. ఇవి హిమముచే కప్పబడి ఉండుటచే వీటికి తెల్లని పర్వతములు అని పేరు వచ్చెను. ఇది పలెస్తీను ఉత్తరపు సరిహద్దు నుండి 95 మైళ్ళ వరకు ఉత్తరదిక్కుగా వ్యాపించును. ఈ రెండు పంక్తులలో పడమరగా ఉండునది సముద్రమునకు సమీపమందుండి దక్షిణమున 6000 అడుగులును ఉత్తరమున 10,000 అడుగులు ఎత్తు కలిగి యున్నది. లెబానోను అను పేరు రోమీయులు పెట్టిరి. దీని దక్షిణమున హెర్మోను శిఖరము ఉన్నది. అది అన్నింటి కంటె ఎత్తైన శిఖరము. ఈ రెండు వరుసలకు మధ్య 3 – 6 మైళ్ళ వెడల్పు గల లోయ ఒకటి కలదు.

ఈ పర్వతములను గూర్చిన సూచనలు కొన్ని బైబిలునందు కలవు. లెబానోను మిగుల నీటి ఊటలు గల పర్వతము, మిగుల ఫలవంతమైనది, దాని వనములు సుప్రసిద్ధములు. ఈ పర్వతములందు దొరుకు కలపతో ఓడలను కట్టిరి. యెరూషలేము లోని ఆలయమును, నగరములను కట్టుటకు ఇక్కడ నుండి మ్రానులను తెప్పించిరి. ఈ పర్వతములు పలెస్తీను దేశపు సరిహద్దులను చెప్పబడెను. ఈ కొండలు అలంకార రీతిగా అనేకచోట్ల ప్రశంసించబడెను. ఈ పర్వతములపై వచ్చు సువాసన మిగుల మధురమైన దానికిని, దాని వృక్షములు గొప్ప వైభవమునకును సూచనలుగా ఉన్నవి. దాని పుష్పములు సౌందర్యమునకును, దాని వృక్షములను నరుకుట దేవుడు జనములకు చేయు తీర్పునకును సూచనలైయున్నవి.

ఈ పర్వతములు ఇప్పటికిని మిగుల ప్రసిద్ధములైనవైనను వాటి వనములు చాల మట్టునకు అంతరించినవి. ఆ ప్రదేశము చాలకాలము వరకు తురుష్క ప్రభుత్వము క్రింద ఉండెను గాని, 1860 సం॥ నుండి దానికి ఒక క్రైస్తవ గవర్నరు నియమింపబడెను. 1919వ సం॥ మొదలు అది బ్రిటీషు వారి సంరక్షణ క్రింద నుండి ప్రస్తుతము స్వతంత్ర రాజ్యముగా ఉన్నది.




# బైబిల్ క్విజ్ -14

(సువార్తలలో నుండి ఇవ్వబడినవి)

**ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.**

**1.** **యేసు బోధింప మొదలు పెట్టినప్పుడు ఆయన వయస్సు ఎంత ? రిఫరెన్సు ?**

**2.** **గ్రుడ్డి భిక్షకుని పేరు ఏమిటి? ఎవరి కుమారుడు?**

**3.** **సిలోయమను మాటకు అర్థమేమిటి? రిఫరెన్సు?**

**4.** **అమ్మా, నీ విశ్వాసము గొప్పది, నీవు కోరినట్టు నీకు అవునుగాక అని యేసు ఎవరితో అనెను? రిఫరెన్సు?**

**5.** **ఉత్తమమైనది ఏర్పరచుకొనిన స్త్రీ ఎవరు?**

**6.** **అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమని ఎవరు ఎవరితో అన్నారు?**

**7.** **ధర్మశాస్త్రము మోషేద్వారా అనుగ్రహింబడెను, మనకు యేసుక్రీస్తు ద్వారా ఏమి కలిగెను? రిఫరెన్సు?**

**8.** **మనుష్యుని అపవిత్రపరుచునది ఏది?**

**9.** **ఒక తలాంతు విలువ ఎంత?**

**10.** **యోహాను సువార్త ఎవరు వ్రాశారు?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు జనవరి 31 తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మార్చి 2011 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**<u>బైబిల్ క్విజ్ - 13 జవాబులు :</u>**

**1.** హబక్కూకు 2:12

**2.** నహూము 3:7

**3.** యోనా దేవునితో, యోనా 4:3

**4.** ఓబద్యా 1:12

**5.** సీయోను, యెరూషలేము - మీకా 4:2

**6.** యోనా, యెహోవా - యోనా 2:9

**7.** హబక్కూకు 1:13

**8.** జనుల ప్రధానులు, వారి యాజకులు - మీకా 3:11

**9.** హబక్కూకు 3:2

**10.** మేఘములు - నహూము 1:3

**<u>బైబిల్ క్విజ్ - 13 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

జి.శారదా, యశోద, ప్రియాంక, జి.కె.యశోద, ఐజక్ కుమారి, శిరీష, జె.రాజ్యం, కోమలి, వి.రాణి, పి.షీబారాణి, విజయలక్ష్మి, వి.సుధారాణి, కృప, ఎమ్.విజయ, కె.వసంత రాణి సాగర్, కె.జ్యోతి, బి.సౌజన్య, రాజ్‌కుమార్, జి.శ్యామ్‌ప్రసాద్

# ఎపఫ్రా మినిస్ట్రీస్

## 2011 ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు

| నెల | తేది | వారం | సమయం (ఉదయం) | స్థలం (మందిరం) |
|---|---|---|---|---|
| జనవరి | 26 | బుధ | 9.00 | భాగ్యలత |
| ఫిబ్రవరి | 06 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మార్చి | 03 | గురు | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| ఏప్రియల్ | 22 | శుక్ర | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మే | 01 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| జూన్ | 05 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| జూలై | 03 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| ఆగష్టు | 15 | సోమ | 9.00 | భాగ్యలత |
| సెప్టెంబర్ | 01 | గురు | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| అక్టోబర్ | 06 | శుక్ర | 9.00 | భాగ్యలత |
| నవంబర్ | 06 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| డిసెంబర్ | 04 | ఆది | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |

**యౌవనస్థుల కూడికలు:-**
ప్రతి నెల 2వ బుధవారం - భాగ్యలత
రాత్రి గం. 7.00 లకు

**స్త్రీల కూడికలు:-**
ప్రతి నెల 1వ బుధవారం - భాగ్యలత
ప్రతి నెల 2వ బుధవారం - చింతల్
రాత్రి గం. 7.00 లకు

**సేవకుల కూడిక:-** ప్రతి నెల 4వ బుధవారం - భాగ్యలత నందు రాత్రి గం. 7.00 లకు.

**"రాబోవు కాలమునందు నీకు మేలు కలుగునను నమ్మిక యున్నది. ఇదే యెహోవా వాక్కు"** యిర్మీ 31:17

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జనవరి - ఫిబ్రవరి

**భాగ్యలత** : చైత్రిక, హరికుమార్, సులోచనారాణి, రంగా, మణి, రమాదేవి, కుమారి, కార్తీక్‌కృష్ణ, పాల్‌ప్రవీణ్, దీవెన, నిర్మల, తిరుమల, హైమావతి, రాజ్‌కుమార్, సజీవ్, కృపాలత, సత్య, రాజేష్, రగూయేల్, మంజుల, జోసెఫ్, పూజిత, తిమోతి, నిహారిక, తులసి, జ్యోత్స్న, జోసెఫ్, కరుణాకర్, రాజు, శ్రీనివాస్, సునీత, చల్లారావు, మనోహర్, దివ్య, రాజ్‌కుమార్, లత, స్నేహలత, ఆనందరావు, కొర్నేలి, మేరీసౌజన్య

**చింతల్** : కొర్నేలి, ప్రకాశ్, సజీవ్, శ్రావణి, సునీత, జయరాజు, రాహుల్, జ్యోతిర్మయి,పుష్పలత, జెర్రీరోజ్‌రాయ్, ఉదయ్, రిబ్కా, జె.యస్.ఎన్.మూర్తి, పవన్‌చందు, దానియేల్, హెప్సిబా, అమర్, పద్మజారాణి, రాజు, సువర్ణరాజు,మహిమజ్యోతి, కీర్తన, స్పందన, నాగరాజు, దుర్గావెంకటలక్ష్మి, నాగవెంకటలక్ష్మి

**అనాజ్‌పూర్ :** విజయమ్మ, వైకుంఠరావు, హానోకు, అంకమ్మ, సువమ్మ, సునీత, కీర్తి, మరియ, అమర్‌నాథ్, జాన్‌బీ

**ఇ.సి.ఐ.యల్ :** జీవా, సుజీవ్

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/-లు, సంవత్సర చందా రూ. 50/-లు, జీవితకాల చందా రూ. 1000/-లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

**మీ ప్రార్థనావసరతలు:**

____________________

____________________

____________________

____________________


మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

ది. 25.12.2010 న జరిగిన క్రిస్మస్ ఆరాధనలో వేలాదిగా పాల్గొని ఆసక్తితో
దేవుని వాక్యమును విని, ప్రార్థన చేయడం జరిగినది.









ది. 31.12.2010 న జరిగిన వాచ్ నైట్ సర్వీస్‌లో అనేకులు ఆసక్తితో పాల్గొని
కృతజ్ఞతాస్తుతులు చెల్లించుకుంటూ నూతన సంవత్సరములోనికి ప్రవేశించుట జరిగినది.









# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com
web: www.epaphra.org